క్లుప్తంగా

ఓవర్ లోడుతో వెళ్తున్న వాహనాలపై చర్యలు తీసుకోండి



జేటీసీకి వినతిపత్రం అందిస్తున్న గుండా శ్రీనివాసరావు

చీమకుర్తి: రామతీర్థం నుంచి పలు ప్రాంతాలకు ఓవర్ లోడుతో వెళ్తున్న గ్రానైట్ రవాణా వాహనాలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ బిల్డింగ్ వర్కర్స్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండా శ్రీనివాసరావు జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. చీమకుర్తిలోని కంకర మిల్లులు, గ్రానైట్‌క్వారీలు, ఫ్యాక్టరీల నుంచి చీమకుర్తి మీదుగా రామాయపట్నం పోర్టు, ఒంగోలు వైపు, దర్శి, పొదిలి వైపుకు రవాణా అయ్యే వాహనాలు దాదాపు 800కు పైగా ఉన్నట్లు ఆయన ఈ సందర్భంగా జేటీసీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దాని వలన రోడ్లు దెబ్బ తింటున్నాయని, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

రేపు డాక్టర్ రామకృష్ణ సంస్మరణ సభ

ఒంగోలు మెట్రో: మంగి గేయకావ్య సృష్టికర్త, ఉత్తమ ఉపాధ్యాయుడు డాక్టర్ వంకాయలపాటి రామకృష్ణ సంస్మరణ సభ ఒంగోలులోని హౌసింగ్ బోర్డు కాలనీ మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలో ఈ నెల 26వ తేదీ గురువారం సాయంత్రం ఐదు గంటలకు కళామిత్ర మండలి (తెలుగు లోగిలి), నరసం సంస్థల సంయుక్త నిర్వహణలో జరుగుతుందని కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో కవులు, రచయితలు పాల్గొని సభను విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

ధర్తి అబ భగీ ధరిపై అవగాహన

పెద్దదోర్నాల: మండల పరిధిలోని నల్లగుంట్ల గిరిజన గూడెంలో ధర్తి అబ భగీ ధరి అభియాన్ కార్యక్రమంపై చెంచు గిరిజనులకు మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పంచాయతీ కార్యదర్శి రంగయ్య హాజరై మాట్లాడుతూ 17 మంత్రిత్వ శాఖల గురించి గిరిజనులకు వివరించారు. పతి ఒక్కరికి ఇల్లు, మంచి నీరు, విద్యుత్, రహదారులు, రేషన్ కార్డులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 10 కుటుంబాలకు క్యాస్టు సర్టిఫికెట్లు, రెండు కుటుంబాలకు డెత్ సర్టిఫికెట్లు, 12 కుటుంబాలకు ఇన్‌కం సర్టిఫికెట్లు, 32 కుటుంబాలకు హౌసింగ్‌కు సంబంధించిన వివరాలు అందజేశారు. టెక్నికల్ అసిస్టెంట్ లాలా అహ్మద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాల వెనుక చెత్త చెదారంతో నిండిన డ్రైనేజీ

ఈ దృశ్యం పడమటి నాయుడుపాలెం గ్రామంలోనిది. జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల పక్కనే ఉన్న డ్రైనేజీ కాలువలో చెత్తచెదారం, పేపర్లు, సీసాలతో నిండి ఉంది. ఈ ప్రాంతంలో నిత్యం విద్యార్థుల తిరుగుతూ ఉంటారు. కాలువ నుంచి దుర్వాసన వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువలో ఉన్న చెత్త చెదారం తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చీమలమర్రిలో పాఠశాల ఎదురుగా రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తచెదారం

ఇది చీమలమర్రి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్న రహదారి పరిస్థితి. ఈ రోడ్డుపై నిత్యం వివిధ గ్రామాలకు చెందిన వందల వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రోడ్డు పక్కన చెత్తచెదారం ఉండడంతో దుర్వాసన వస్తోందని స్కూల్ విద్యార్థులు ప్రయాణికులు, గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- ఫొటోలకే పరిమితమైన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర.. ఆచరణలో శూన్యం
- విజృంభిస్తున్న ఈగలు, దోమలు
- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- పట్టించుకోని అధికారులు



నాయుడుపాలెం ఎస్సీ కాలనీలో చెత్తచెదారంతో నిండిన డ్రైనేజీ

చీమకుర్తి రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వీధుల్లో, డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త చెదారం తొలగింపుపై అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదు. కొన్ని గ్రామాల్లోని వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలు చెత్త చెదారంతో నిండిపోయి పూడిక చేరి మురుగు నీరు రోడ్లపైకి వస్తోంది. మురుగు నీరు నిల్వ ఏర్పడి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుద్ధ్య లోపంతో దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి.

నెరవేరని లక్ష్యం..

కూటమి ప్రభుత్వం ప్రతి నెలా 3వ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తోంది. అయితే మండలంలోని కొన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమ లక్ష్యం నెరవేరడంలేదు. కొంతకాలంగా గ్రామాల్లో ఎక్కడా పూర్తి స్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి హామీ కూలీల వేతనం వెంటనే చెల్లించాలి



వేతనం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్న వ్యకాసం నాయకులు, ఉపాధి కూలీలు

సంతనూతలపాడు: మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పని దినాలు ఏడాదికి 100 నుంచి 200 రోజులకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని గురవారెడ్డిపాలెంలో ఉపాధి హామీ కూలీలతో మంగళవారం సమావేశం అయ్యారు. కూలీల వ్యవసాయ పనులన్నీ పూర్తిగా అయిపోయాయని, ప్రస్తుతం ఉపాధి హామీ తప్ప మరొక పని లేదని, గ్రామంలోని పేదలంతా ఈ పని చేస్తున్నామని తెలిపారన్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులతో గ్రామీణ ప్రజలకు పని దినాలు క్రమంగా తగ్గుతున్నాయని, కరువు కాలంలో కష్టజీవులకు కడుపు నింపే లక్ష్యంతో వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని మరింత విస్తరించి, నిధులు పెంచి గ్రామీణ ప్రజలను ఆదుకోవాలని ఆయన కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పనిచేసే కూలీలకు పనిముట్లు ఇవ్వాలని, సమ్మర్ అలవెన్స్, మంచినీళ్లకు బిల్లులు ఇవ్వాలని, చేసిన పని వివరాలతో కూడిన పే స్లిప్పులు ఇవ్వాలని, వర్షాలు పడటం, సాగర్ నీరు రావడంతో వాగుల్లో చెరువుల్లో నీళ్ల నిలిచిపోయాయని అన్నారు. అటువంటి అనేక గ్రామాల్లో ఉపాధి పనులు చేసే దానికి అవకాశం లేకుండా పోతోందని, ప్రత్యామ్నాయ పనులు ఎంపిక చేసి కూలీలకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పాలేటి ఆనందరావు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న గోపీకృష్ణ



వంగ పంటను పరిశీలిస్తున్న ఏవో నీరజ

పత్తిలో సస్యరక్షణ చర్యలు పాటించాలి

పుల్లలచెరువు: వివిధ గ్రామాల్లో ముందుగా సాగు చేసిన పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ విస్తరణాధికారి గోపీకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని ముటుకుల, గంగవరం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల సాగు చేసిన పత్తి పంటను పరిశీలి తగు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో ముఖ్యంగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన ప్రతి పంటను పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కౌలు రైతులంతా సీసీఆర్సీ కార్డులు వీఆర్వోల ద్వారా తీసుకోవాలన్నారు. సీసీ కార్డులు తీసుకున్న వారికి మాత్రమే అన్నదాత సుఖీభవ, క్రాప్ ఇన్సూరెన్స్, ఇతర ప్రభుత్వ పథకాలకు అర్హులని తెలిపారు. సిబ్బంది మంత్రూనాయక్, కొండానాయక్ పాల్గొన్నారు.

నకిలి విత్తనాలతో అప్రమత్తంగా ఉండాలి

పెద్దారవీడు: ఖరీఫ్‌లో సాగు చేసే రైతులు నకిలీ విత్తనాలతో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి ఎన్.లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలో సానికవరం గ్రామ రైతు సేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలని అధికృత లైసెన్స్ కలిగిన డీలర్ల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని, కొన్న వస్తువుకు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని చెప్పారు. రాత్రి పూట జీబుల్లో వచ్చి రసీదు ఇవ్వకుండా తక్కువ ధరకు విత్తనాలు అమ్మేవారి నుంచి కొనుగోలు చేయరాదని, అలాంటి వ్యక్తులు ఏవరైనా గ్రామాల్లో విత్తనాలు అమ్మితే వెంటనే సమీపంలో ఉన్న వ్యవసాయాధికారులకు సమాచారం అందజేయాలన్నారు. మంచి విత్తనాలను ఎన్నుకోవాలని, విత్తన మొలక శాతం చూసుకోవాలని, విత్తనశుద్ధి చేసుకున్న తర్వాతనే పొలంలో విత్తుకోవాలని సూచించారు. కంది పంట సాగు చేసే రైతులు కిలో విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడెర్మా విరిడి శిలింద్ర నాశినితో విత్తనశుద్ధి చేస్తే వేరు కుళ్లు తెగుళ్లు రాకుండా చేయవచ్చన్నారు. ఏఈఓ సునీల్‌నాయక్ మాట్లాడుతూ విత్తనాలు మొలక కట్టుకొను విధానాన్ని, విత్తనశుద్ధి చేసుకొనే పద్ధతులు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వీఏఏ శిరీష, రైతులు పాల్గొన్నారు.



డొనకొండ: రైతులతో మాట్లాడుతున్న ఏఓ



పెద్దారవీడు: విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ఏఈఓ సునీల్‌నాయక్



కురిచేడు: రైతులకు సూచనలిస్తున్న ఏఓ సంపత్‌కుమార్

దొనకొండ: రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు యజమాని దగ్గర తప్పని సరిగా బిల్లులు పొందాలని మండల వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్ తెలిపారు. మండలంలోని ఇండ్లచెరువు, వెంకటాపురం రైతు సేవా కేంద్రాల పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు వ్యవసాయ శాఖ సేవలు వినియోగించుకోవాలన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా క్షేత్ర ప్రదర్శన జరుగుతుందని, పంటలపై ఆశించు చీడ పీడలు మరియు తెగుళ్ల గురించి తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకుని దానికి సంబంధించిన మందులు వాడుకుని అధిక దిగుబడులు పొందాలన్నారు. ఖరీఫ్‌లో పంటలకు ఇన్సూరెన్స్ రైతులే కట్టుకోవాలన్నారు. ఎకరా వరికి రూ.860, కందులు రూ.430, సజ్జ రూ.156, ఎండు మిర్చి రూ.4500, మినుములు రూ.205, నువ్వులు రూ.180, పత్తి రూ.2100 ప్రీమియం చెల్లించాలన్నారు. మునిబాబు, రైతులు పాల్గొన్నారు.

కురిచేడు: భూసార పరీక్షల ఫలితాల ఆదారంగా ఎరువులను వాడితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించడంతో పాటు నేల సారవంతాన్ని కాపాడవచ్చని మండల వ్యవసాయాధికారి బి.సంతప్‌కుమార్ తెలిపారు. మండలంలోని పొట్లపాడు, పడమర గంగవరం గ్రామాల్లోని రైతులను ఆయన మంగళవారం కలిసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో భాగంగా ఈ సంవత్సరం ఖరీఫ్ 2025-26 ఏడాదికి సంబంధించి జిల్లా నోటిఫైడ్ పంటలుగా వరి, కంది, సజ్జ, ఎండుమిర్చి, మినుము, నువ్వులు, పత్తి పంట ఎంపికైనట్లు పేర్కొన్నారు. రైతులు ఈ పంటలకు ప్రీమియం చెల్లించి పంటల బీమా పొందొచ్చన్నారు. కౌలుకార్డుతో కలిగే ప్రయోజనాలు వివరించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల గురించి వివరించారు. జనుము, జీలుగ పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. పొట్లపాడు సర్పంచ్ జ్యోతి సుబ్బులు, వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: ఖరీఫ్‌లో సాగచేసే విత్తనాలు శుద్ధి చేసి నాటుకుంటే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో కె.నీరజ అన్నారు. మంగళవారం మండలంలోని వీరభద్రాపురం, మొగుళ్లపల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సీజన్‌లో వేయబోయే పంటల పోషకాలు ఆర్గానిక్ కార్బన్, నైట్రోజన్, ఫామ్‌మ్యాడ్ మెన్యూర్, వర్మికంపోస్ట్ వంటి పోషక విలువలు భూమిలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రధాన పంటల్లో అంతర్ పంటలు సాగు చేసుకొని అదనపు ఆదాయం పొందే విధంగా ఆమె రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవోలు పొట్టయ్య, ధనేశ్వర్ నాయక్, మద్దయ్య, కె.రమేష్‌బాబు, ఎస్.జాషువా పాల్గొన్నారు.

ముగ్గురికి ట్రిపుల్ ఐటీ సీట్లు



కె.వెంకట దీప్తి, పెదకొత్తపల్లి



సుశాంత్‌కుమార్, లింగంగుట



పి.ఇవాంజిలిన్ పెదకొత్తపల్లి

మద్దిపాడు: ట్రిపుల్ ఐటీ సీట్లు మండలంలోని ముగ్గురు విద్యార్థులకు వచ్చాయి. పెదకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి 582 మార్కులు సాధించిన కే వెంకట దీప్తి నూజివీడు ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించగా, అదే పాఠశాలకు చెందిన పీ ఇవాంజిలిన్ 570 మార్కులు, లింగంగుంట గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన సీహెచ్ సుశాంత్ కుమార్ 575 మార్కులు సాధించి ఒంగోలు ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీటు సాధించారు. వీరిని ఎంఈఓలు ఎంవీఆర్ అంజనేయులు, ఎం శ్రీనివాసరావులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వసంతకుమారి, ఎం రామారావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



విద్యార్థినులకు అభినందనలు తెలుపుతున్న పాఠశాల ఉపాధ్యాయులు

ట్రిపుల్ ఐటీకి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు

చీమకుర్తి రూరల్: ట్రిపుల్ ఐటీలో పల్లామల్లి జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు అడ్మిషన్‌లు సాధించారని ప్రధానోపాధ్యాయుడు సాయి తెలిపారు. మంగళవారం పల్లామల్లి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో ముగ్గురు విద్యార్థినులకు వీ రాజ్యలక్ష్మి, డీవీవీ పూజిత, వీ బ్లెస్సీ ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారని హెచ్‌ఎం వారిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేషనలైజేషన్ తర్వాతే బదిలీలు ప్రారంభించాలి



ఎంపీడీవో సురేష్‌బాబుకు వినతి పత్రం అందజేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

సంతనూతలపాడు: రేషనలైజేషన్ ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేయకుండా ఇంజినీరింగ్ అసిస్టెంట్లను బదిలీ చేయడం నిలిపేయాలని కోరుతూ మంగళవారం ఎంపీడీవో డీ సురేష్ బాబుకు మండలంలోని సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వినతి పత్రం అందజేశారు. రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి కాలేదని, మిగులు ఉద్యోగులపై స్పష్టత ఇవ్వకుండా బదిలీలు చేపట్టడంపై వారు ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. జీవో నంబర్ 5 ను ప్రభుత్వం వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల్లో చేరి ఆరేళ్లయినా నేటికీ పదోన్నతులు కేటాయించలేదన్నారు. సొంత మండలంలో కాకుండా పక్క మండలాలకు బదిలీ ప్రక్రియ నిలిపేయాలన్నారు. పలు సర్వేలు, బీఎల్వోల డ్యూటీలను కూడా వారిచేత చేస్తున్నామని వాపోయారు. కార్యక్రమంలో సంతనూతలపాడు మండల సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వి.కిరణ్ రాజు, యోగేష్, పావని, శ్రీనివాసరావు, సావిత్రి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి



గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో ప్రమాదాలు జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

మద్దిపాడు: మండల పరిధిలోని ఏడుకొండలపాడు నుంచి గుండ్లపల్లి గ్రోత్ సెంటర్ వరకు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని డీఎస్పీ ఆర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన ఏడుకొండలపాడు, వెంకటరాజుపాలెం, సీతారాంపురం కొష్టాల సెంటర్, గుండ్లపల్లి గ్రోత్ సెంటర్ లను పరిశీలించారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, జిగ్ జాగ్ ట్రాఫిక్ ను ఏర్పాటు చేయడానికి అవసరమైన స్పీడ్ కంట్రోలర్ లను ఏర్పాటు చేసుకోవాలని ఆయన ఎస్సై ని ఆదేశించారు. ప్రయాణికులు జాతీయ రహదారిని దాటే క్రమంలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, అటువంటి చోట్ల పటిష్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎస్సై శివరామయ్య పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పంటల్లో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి



మాట్లాడుతున్న ఏఓ భాస్కర్

చీమకుర్తి రూరల్: ప్రధాన పంటల్లో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడటం వలన తెగుళ్లు రావని, అధిక దిగుబడి వస్తుందని మండల వ్యవసాయాధికారి డీవీ భాస్కర్ అన్నారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బండ్లమూడి, పీ నాయుడిపాలెం గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డులు తీసుకోవాలి

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఓ స్వర్ణలత మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కౌలు రైతు కార్డు తీసుకోవాలన్నారు. కౌలు రైతుకు పంట నష్టం వాటిల్లిన సమయంలో ఈకార్డు పనికి వస్తుందని, పంటను ఇన్‌స్రూ చేయించుకోవడానికి ఈ కార్డు అవసరమని తెలిపారు. కౌలు రైతులకు కార్డులు అందజేశారు. పశుసంవర్ధక శాఖ డాక్టర్ హిరణ్మయి మాట్లాడుతూ పశువుల దాణా నట్టల నివారణ మందు ఆర్‌ఎస్‌కేలో అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో వారి వెంట గ్రామ రైతులు వీఏఏలు స్పందన, శిరీష పాల్గొన్నారు.

సోలార్ వినియోగం పెంచడమే లక్ష్యం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

దర్శి (కురిచేడు): విద్యుత్ వినియోగదారులు సోలార్‌ను వినియోగించుకునేలా సిబ్బంది ప్రోత్సహించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. దర్శిలోని పీటీఎస్ కళ్యాణ మండపంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 1650 సోలార్ కనెక్షన్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సోలార్‌పై వినియోగదారులకు అవగాహన కల్పించి కింది స్థాయి నుంచి ఎగువ స్థాయి వరకు విద్యుత్ అధికారులు ప్రతి ఒక్కరూ రెండు కనెక్షన్లు ఏర్పాటు చేయటమే లక్ష్యంగా పని చేయాలని, ఒక కిలో వాట్‌కు 30 వేల రూపాయలు, రెండు కిలోవాట్లకు 60 వేల రూపాయలు, మూడు కిలోవాట్లకు 78 వేల రూపాయల సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. అధిక కరెంటు బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీనియర్ అకౌంట్ ఆఫీసర్ కె.సుబ్బారావు, ఈఈ పి.శ్రీనివాసులు, డీఈఈ పి.రవికుమార్, దర్శి డివిజన్‌లోని డిప్యూటీ ఈఈలు, ఏఈలు, ఏఏఓలు, జేఏఓలు పాల్గొన్నారు.